
క్లుప్తంగా

మల్లాది విష్ణు ఉగాది శుభాకాంక్షలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి నూతన సంవత్సరాది అయిన ఉగాది పూర్తిగా ప్రకృతితో మమేకమై జరుపుకునే పండుగ అని చెప్పారు. షడ్రుచుల సమాహారమైన ఉగాది పచ్చడి ఇందుకు నిదర్శనమన్నారు. మనిషి జీవితంలోని కష్ట సుఖాలు, మంచి చెడులు వంటి జీవిత సారాన్ని తాత్వికంగా గుర్తుచేసుకునే గొప్ప సాంప్రదాయానికి చిహ్నంగా ఉగాది పచ్చడిని సేవిస్తారని పేర్కొన్నారు. ఈ నూతన తెలుగు సంవత్సరం తెలుగువారి జీవితాల్లో ఎనలేని ఆనందం, ఐశ్వర్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. వానలు సకాలంలో కురిసి.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. పాడి పంటలతో రైతులు, సకల వృత్తులూ పరిఢవిల్లాలని.. కార్మికులు, నిరుపేదలు, సామాన్యులు సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ నూతన వసంతంలో సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు చేశారు. మహిళలు శ్రీలలిత సహస్ర నామపారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి ఉగాది సంబరాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత ఈశ్వరమ్మ అమ్మవారి ఉగాది సంబరాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు, కోశాధికారి డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, సామంతపూడి చిన్నా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు మేలుకొలుపుతో ఉగాది సంబరాలు ప్రారంభ మవుతాయన్నారు. 6.30 గంటలకు ఈశ్వరమ్మతల్లి సోదరి మహాలక్ష్మి అమ్మవారు (రావిచెట్టు)కి సకాలంలో వర్షాలు కురవాలని 108 కడవలతో నీరు పోసి, పసుపు, కుంకుమ, గాజులు సమర్పిస్తామని చెప్పారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తామని పేర్కొన్నారు. శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ, అలంకారం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి మందలపర్తి సత్యశ్రీహరి దంపతులచే రవికలు, పసుపుకొమ్ములు, గాజులతో పూజ అనంతరం మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు చేస్తామన్నారు. 31న రుద్రరాజు వెంకట సుబ్బరాజు దంపతులచే అన్నప్రసాద వితరణ ఉందన్నారు. భక్తులు ఉగాది సంబరాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేటి నుంచి వసంత నవరాత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. విశ్వావసు నామ సంవత్సరాది వేడుకలు, వసంత నవరాత్రోత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి తెల్లవారుజామున స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజల అనంతరం ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. స్నపనాభిషేకం నేపథ్యంలో ప్రతి రోజు తెల్లవారుజామున జరిగే పలు ఆర్జిత సేవలను రద్దు చేయడంతో పాటు మరికొన్ని సేవల సమయాన్ని మార్పు చేస్తూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

9 గంటలకు అమ్మవారి దర్శనం, ఆర్జిత సేవలు

తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం నేపథ్యంలో సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ సేవ, ఖడ్గమాలార్చన, రుద్ర హోమం సేవలను దేవస్థానం రద్దు చేసింది. ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనాలు ప్రారంభం కావడంతో పాటు అదే సమయానికి లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం, శ్రీచక్ర నవార్చన, చండీహోమం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు ప్రారంభం కానున్నాయి. నూతనంగా నిర్మించిన పూజా మండపాలలో ఈ విశేష పుష్పార్చన నిర్వహించేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. ఇక మహా మండపం ఆరో అంతస్తులో దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాసశర్మచే పంచాంగ శ్రవణం జరుగుతుంది.

వాంబేకాలనీ బస్‌స్టేషన్ నిర్మాణమయ్యేనా?



వాంబే కాలనీలో బస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

- శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాని వైనం
- పట్టించుకోని కొత్త ప్రభుత్వం
- లక్షలాది మంది ప్రయాణికుల ఎదురుచూపు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): దశాబ్దాలుగా సింగ్‌నగర్ ప్రాంతవాసులు ఎదురు చూస్తున్న వాంబే కాలనీ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గత ఏడాది బస్‌స్టేషన్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు శంకుస్థాపన చేశారు. టెండర్ పిలిచి పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం బస్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది. ప్రజల చిరకాల కోరిక అయిన బస్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయితే నూజివీడు, మైలవరం, నున్న, పాయకాపురం, సింగ్‌నగర్, వాంబేకాలనీ, జక్కంపూడి తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు ఈ బస్‌స్టేషన్ మీదుగా నడిపేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కానీ బస్‌స్టేషన్ నిర్మాణం పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ ప్రాంతవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



గత ఏడాది శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఒక్క ఇటుక పడలేదు....

నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాది పూర్తయినా ఒక్క ఇటుక కూడా పడలేదు. ఈ బస్‌స్టేషన్ పూర్తయితే ఆయా ప్రాంతాల్లో నివాసితులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. సుమారు ఐదు లక్షలమందికి పైగా జనాభా ఉన్నా సరైన బస్ సౌకర్యం లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. నున్న, సింగ్‌నగర్ ప్రాంతవాసులు ప్రస్తుతం ఆటోనగర్, ప్రభుత్వం హాస్పటల్ వరకు వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సమయం వృథా అవ్వటమే కాకుండా ఖర్చులు కూడా రెండింతలు చెల్లించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరతగతిన వాంబే కాలనీ బస్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తిచేసి స్థానికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

సమయం వృథా



నున్న నుంచి ఆటోనగర్ వెళ్లాలంటే రెండు బస్సులు మారాలి. ఎంతో సమయం వృథా అవ్వటంతో పాటు రెట్టింపు చార్జీలు అవుతున్నాయి. సమయానికి బస్సులు కూడా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. బస్‌స్టేషన్ నిర్మాణం వెంటనే చేపట్టి పూర్తిచేస్తే మాకు ఉపయోగంగా ఉంటుంది.

– కొండా రెడ్డి, నున్న

నిర్మాణం పూర్తిచేయాలి



బస్‌స్టేషన్ పూర్తయితే నగరంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది. వాంబే కాలనీ బస్‌స్టేషన్ నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే పూర్తిచేసే చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం బస్సులు అందుబాటులో లేకపోవడంతో భద్రత లేకపోయినా తప్పనిసరి పరిస్థితిలో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది.

– బషీర్, సింగ్‌నగర్

ఒలింపిక్, నాన్ ఒలింపిక్ క్రీడాకారులకు సమన్యాయం చేయండి

ఒలింపిక్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.పి.రావు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలోని ఒలింపిక్, నాన్ ఒలింపిక్ క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగ, పారితోషకాల్లో సమన్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (రిజిస్టర్ నంబర్: 175/1961) డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు శనివారం ఆయన రాసిన లేఖను పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 64 క్రీడలను గుర్తించినప్పటికీ వీటిల్లో ఉన్న 28 నాన్ ఒలింపిక్ క్రీడాకారులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. ఒలింపిక్ క్రీడాకారులకే గ్రూప్–1 ఉద్యోగాలు ఇస్తామనటం సమంజసం కాదని తెలిపారు. దీని వల్ల సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో తదితర క్రీడాంశాల క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్రీడా పాలసీలో క్లారిటీ లేదని, క్రీడల అభివృద్ధికి సంబంధించిన జీఓలు విడుదల చేయకుండా క్రీడలను అభివృద్ధి చేస్తామని ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోడ్ ప్రకారం 490, 272 జీవోలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సంఘాల మధ్య నెలకొన్న వివాదాలు పరిష్కరించాలని, క్రీడా సంఘాల అవినీతిలో సీబీడీ, ఏసీబీతో విచారణ జరిపించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పర్మినెంట్ వీసీ, ఎండీని నియమించాలని డిమాండ్ చేశారు. క్రీడా సమస్యలను పరిష్కరించకపోతే శాప్ కార్యాలయం ముందు ఒక రోజు నిరాహార దీక్ష చేపడతానన్నారు. అప్పటికీ ప్రభుత్వంలో కదలిక రాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడ): గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ప్రముఖ సాహితీ వేత్తలు గుమ్మా సాంబశివరావు, జీవీ పూర్ణ చందు, చలపాక ప్రకాశ్, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ ఎరుబోతు రమణారావు పాల్గొని త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామివారు రచించిన తెలుగు క్యాలెండర్‌లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యే విధంగా సరళమైన బాషలో రూపొందించారన్నారు. దేవాలయ సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టతను తెలియజేశారన్నారు. భగవద్గీత శ్లోకాలను పొందుపర్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి–ఇందూ జ్ఞాన వేదిక – విజయవాడ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు జే.సురేష్, తిరుపతి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

మత విశ్వాసాలు గేలిచేస్తున్న వారిని అరెస్టు చేయాలి

హిందూ చైతన్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ అంబటి మారుతీరామ్



మాట్లాడుతున్న కన్వీనర్ అంబటి మారుతీ రామ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ఏ ఘటన జరిగినా దానిని హిందువులపైకి నెట్టి బురదజల్లే కార్యక్రమం జరుగుతోందని హిందూ చైతన్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ అంబటి మారుతీ రామ్ అన్నారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ దేవతలను, మత విశ్వాసాలను గేలిచేస్తున్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతిలో అనుమానాలను నివృత్తి చేసేందుకు న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనుమానితులైన రంజిత్ ఓఫిర్, సమీ హుస్సేన్ తదితరులను విచారించాలన్నారు. సమావేశంలో హిందూ చైతన్య వేదిక మహిళా కన్వీనర్ ఎస్.బి కనకదుర్గ, పొట్టి మూర్తి శ్రీనివాస్. జిల్లా సహ సంయోజక్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ముస్లిం మత పెద్దలతో కలిసి నమాజ్ చేస్తున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు



పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి, ముస్లింలకు ఏ కన్వెన్షన్‌లో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని మతాల వారు పరమత సహనం పాటించడమే భారత దేశం విశిష్టత అని తెలిపారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లిం మత పెద్దలు సీపీ రాజశేఖరబాబుకు జ్ఞాపికను అందజేశారు. అనంతరం జరిగిన నమాజ్, ఇఫ్తార్ విందులో సీపీ రాజశేఖరబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలి

నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జాతీయ అధ్యక్షుడు జాన్ మాస్క్



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ మస్క్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షుడు జాన్ మాస్క్ ప్రభుత్వాన్ని కోరారు.ఆయన మృతిపై ఎటువంటి ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సరైంది కాదన్నారు. శనివారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రవీణ్ ఎదుర్కొన్న ప్రాణహాని హెచ్చరికలు, ప్రమాద సమయంలో ఆయన శరీరంపై ఉన్న గాయాల నేపథ్యంలో పాస్టర్ ప్రవీణ్ మృతి వెనుక కుట్ర దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా దర్యాప్తు చేసి నిజాలను వెలికి తీయాలని కోరారు. డాక్టర్ బి.నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవ నాయకులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత రావు, విజయవాడ అధ్యక్షుడు బి. సుందర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న నిర్వహించే ఉగాది పురస్కారాలు – 2025 అందించేందుకు వివిధ విభాగాల్లో ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్యం, సాహిత్యం సంగీతం , కళలు, క్రీడలు, నృత్యం, కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, నాటక, సినీ, టీవీ తదితర రంగాల్లో సేవలందిస్తున్నవారు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పురస్కారాల ఎంపిక కోసం వారి సేవలు, ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుతోపాటు జతచేసి పంపించాలని కోరారు. దరఖాస్తులు ఏప్రిల్ 5వ తేదీ లోగా అకాడమీ కార్యాలయానికి పంపాలన్నారు. వచ్చేనెల 13వ తేదీన హైదరాబాద్‌లో ప్రముఖుల చేతులమీదుగా పురస్కారంతో సత్కరించనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఎయిడ్స్ బాధితులు మనోధైర్యంతో ఉండాలి

పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేసిన ఫాదర్ నీలం రత్నకుమార్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు ఆరోగ్యంగా, మనోధైర్యం కలిగి ఉండాలని నవజీవన్ బాలభవన్ ఈడీ ఫాదర్ నీలం రత్నకుమార్ అన్నారు. నీతోడు మానసిక వికాస కేంద్రంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాధితులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రులలో ఏ.ఆర్.టి సెంటర్స్‌లో వైరల్ లోడ్‌ని పరీక్షించుకోవచ్చని, వైరల్ లోడ్‌ను బట్టి మందులు కూడా ఉచితంగా అందచేస్తారన్నారు. మందుల్ని కూడా నిర్ణిత సమయానికి వేసుకోవాలని, పౌష్టికాహారం ప్రతి రోజు తీసుకోవాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ బాధితులు శారీరక బలం పెంచుకోవడం కోసం పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. ఈ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్, వలంటీర్స్, హైమావతి, దుర్గా, రాణి తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరికి ఉగాది విశిష్ట పురస్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఐదు దశాబ్దాల పైగా సాహిత్య సాంస్కృతిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన కవి, రచయిత, సంపాదకులు, స్వచ్ఛంద సేవకులు కొల్లూరికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది విశిష్ట పురస్కారం ప్రకటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే విశ్వావసు ఉగాది వేడుకల్లో ఈ పురస్కారం కొల్లూరి అందుకోనున్నారు. ఈ మేరకు పురస్కారంను స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత – సంస్కృతి సమితి నుంచి కొల్లూరికి శనివారం ఆహ్వానం అందింది. కొల్లూరి మినీ, దీర్ఘ కవితలు, సామాజిక స్పృహ కలిగిన అనేక రచనలు, పలు గ్రంథాలు రచించారు. వైవిధ్యభరితమైన సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. కొల్లూరిని సాహితీ ప్రముఖులు, లయన్స్, వాకర్స్ మిత్రులు, డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బి. వసంతకుమార్ తదితరులు అభినందించారు.

భారతి విద్యామందిర్‌లో ఉగాది సంబరాలు



ఉగాది సంబరాలలో చిన్నారులు

మదురానగర్(విజయవాడసెంట్రల్): లక్ష్మీనగర్ భారతి విద్యామందిర్‌లో శనివారం ఉగాది సంబరాలు కనులపండువగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేషధారణలతో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. షడ్రుచుల ఉగాది పచ్చడిని తయారు చేయటంతో పాటు ప్రతి ఒక్కరికీ అందజేసి తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేములూరి స్వప్న ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియ చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియచేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉగాది సంబరాలలో చిన్నారులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అట్టహాసంగా నాగ నూకాంబిక జాతర



నాగ నూకాంబిక జాతరలో మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాగ నూకాంబిక అమ్మవారి జాతరకు ఎంతో విశిష్టత ఉందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రధాన రహదారిలోని శ్రీ నాగ నూకాంబిక అమ్మవారి దేవస్థాన 49 వ ఉగాది జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గరగ, గణాచారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాది విష్ణు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఉగాదికి ముందురోజు నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లిగా నూకాంబికను భక్తులు కొలుస్తారని చెప్పారు. జాతర ప్రారంభానికి ముందుగా తలలపై గరగలు పెట్టుకుని ఆ ప్రాంతమంతా తిరగటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఉత్సవాలకు స్థానికులే కాకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొంటారని చెప్పారు. నూకాంబిక అమ్మవారి దివ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు నిరసనగా ధర్నా



అజిత్‌సింగ్‌నగర్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మక ద్రోహం చేసిందని.. 9 నెలల్లో రూ. 15,485 కోట్ల భారం ప్రజలపై మోపారని సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాలు, అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విద్యుత్ సుంకాన్ని.. చిన్న, మధ్య తరగతి వ్యాపారులపై యూనిట్‌కు 6 పైసల నుంచి 100 పైసలకు భారం పెంచారని విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు పెరిగి జనం గగ్గోలు పెడుతున్నా , చార్జీలు పెంచలేదని ప్రజలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారన్నారు. సీపీఎం సెంట్రల్ కార్యదర్శి బి.రమణరావు మాట్లాడుతూ ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించటానికి రంగం సిద్ధమయ్యిందని తెలిపారు. ఆనాడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని లోకేష్ పిలుపునిచ్చారని.. నేడు అదే కూటమి ప్రభుత్వం శరవేగంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని దుయ్యబట్టారు. మోదీ, అదానీ, చంద్రబాబు ప్రభుత్వం కుమ్మక్కయ్యి ప్రజలకు ఉరితాడు బిగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు టి.ప్రవీణ్, సీహెచ్ శ్రీనివాస్, దుర్గారావు, ఎస్‌కే ఫీర్ సాహెబ్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలని ఆందోళన

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



బాధితుడు ఉన్న అంబులెన్స్‌తో శారద కళాశాల జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు గోడకూలి వెన్నుపూస దెబ్బతగిలి మంచానికే పరిమితమైన తాపీమేస్త్రీ కిలాని పైడిరాజుకు మెరుగైన వైద్య అందించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు, కుటుంబ సభ్యులు బాధితుడిని అంబులెన్స్‌లో తీసుకొచ్చి సత్యనారాయణపురం, శారద కళాశాల జంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పైడిరాజు సొంటి సురేష్ అనే బిల్డర్ వద్ద పనిచేస్తుంటాడని తెలిపారు. పని ప్రదేశంలో పాత భవనం గోడ కూలి మీదపడటంతో వెన్నుపూసకు దెబ్బతగిలి స్పర్శ కోల్పోయినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో బిల్డర్ సురేష్‌కుమార్ బాధితున్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడి పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోగా బిల్డర్ సురేష్‌కుమార్ బాధితునికి మెరుగైన వైద్యం అందిస్తానని కుటుంబ సభ్యులను నమ్మించి కేసు నమోదు కాకుండా అడ్డుకున్నాడని తెలిపారు. ఇది జరిగి నెల రోజులు కావస్తున్నా బాధితున్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఇదేమని అడిగితే యూనియన్ నేతలు, కుటుంబ సభ్యులపైనే కేసులు పెడతానంటు భయపెడుతున్నట్లు ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం బాధితునికి మెరుగైన వైద్య సేవలు అందించి రోడ్డున పడ్డ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం తెలియడంతో ఎస్ఎన్ పురం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఆందోళనకారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిల్డర్ సురేష్‌కుమార్‌తో మాట్లాడి బాధితుడిని ప్రైవేటు హాస్పటల్‌లో చేర్పించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు, బాదిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ, ఎక్స్‌రే వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి 75 రోజులు ఉచిత మజ్జిగ పంపిణీ నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు కొల్లూరి, కార్యదర్శి బి. ఆంజనేయరాజు తెలిపారు. సంస్థ సభ్యుల సహకారంతో సామాజిక బాధ్యతగా మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.